# నిద్రలేని రాత్రి

ప్రపంచమంతా హాయిగా నిద్రపోతుండగా తను మాత్రం మేలుకొని ఉండడం ఎంతబాధ!— అందులో, ప్రక్కన మనిషి హాయిగా గుర్రుపెడుతూ ఉంటే...

ఆ వేళ రాత్రి నాటకానికి వెళ్ళారు. నాటకంచూస్తూ వచ్చిన తలనొప్పి ఇంకా పోనేలేదు... ఏమి నాటకం! 'బెని ఫిట్ షో' అట!

చాతా వాతా కానివాళ్ళంతా నాటకాలాడి, హాయిగా బ్రతుకుతున్న వాళ్ల నెత్తిన రుద్దకపోతే ఏమో! ఊరికే, 'ధర్మమని' అడుగకూడదూ?

అబ్బా ! నిద్దరరాకపోతే ఏవేవో ఆలోచనలు వస్తూనే ఉంటాయి. తలనొప్పికితోడు ఈ ఆలోచనలతో మెదడు దిమ్మెక్కిపోతుంది.

ఏవేవో పిచ్చి ఊహలు.

ఆ రోజంతా జ్ఞాపకంవస్తుంది ! తను అసలు ఆ నాట కానికి వెళ్ళాలనుకోలేదు. ప్రొద్దున్నే మాలతి వచ్చింది. 'ఏమండీ! ఇవ్వాళ మా కాలేజీలో నాటకంవేస్తున్నాం. బెని ఫిట్ షో! మీరు తప్పకుండా రావాలి!'

'ఓ! అల్లాగే! అల్లాగే!' అంటున్నా రతను, అనవస రంగా గట్టిగా నవ్వుతూ.

లిప్‌స్టిక్కూ, జార్జెట్టు చూస్తే ఈ మగవాళ్లకు ఉన్న మతి కూడా పోతుంది.

'రెండు పాతిక రూపాయల టిక్కట్లు ఇస్తున్నానండి' అని మాలతి——

వంటఇంటిలోనుంచి వింటూన్న తనకు గుండెలో రాయి పడినట్లయింది. ఎంత మాటచాతుర్యం చూపినా, అధికారం చెలాయించినా, భార్యదగ్గరే! పరాయి స్త్రీలను చూస్తే, మంత్రముగ్ధులైనట్టు పెదవి కదపలేరు! మెదలకుండా తీసుకొని ఊరుకుంటారు కాబోలు! ఏంచేస్తారో అనుకుంటూండగానే, భర్త లోపలికి వచ్చారు.

'చూడు! జానకీ!! మాలతి వచ్చింది'

'ఆ! అంతా వినపడింది. ఇవ్వాళ వేరే పని ఉంది, రావడానికి ఏమాత్రం వీల్లేదు. ఏం అనుకోవద్దు, అని చెప్పి పంపివెయ్యకూడదూ! పోనీ నేను చెప్పనా?'

'అబ్బే—పాపం! చిన్నబుచ్చుకోదూ?'

'ఐతే ఏం చేద్దాం మరి?'

'నీదగ్గర ఉన్న ఏభై రూపాయలు ఇవ్వరాదూ? నీ చీర తరువాత కొనుక్కోవచ్చు. చీర కిప్పుడు తొందరలేదుగా!'

–ఎన్నాళ్ళనుంచో ఆ చీర కొందామనుకోవటం! మొగమాటం కొద్దీ ఇబ్బందిపడటమూ!

—ఏది వచ్చినా తిరిగి తిరిగి తన నెత్తినే పడుతుంది. కాదంటే అతను బాధపడుతాడేమోనని అన్నింటికి తనే సర్దుకు ఊరుకుంటుంది. ఎన్నాళ్ళనుంచి ఆ గులాబీచీర కొనాలని ప్రయత్నం! అతనికి ఆ రంగు ఇష్టం లేదు అసలు. అందుకనే, ఎప్పుడూ ఏదో వంకతో అది వెనక్కు వెళుతూనే ఉంటుంది.

'సరే! మీ యిష్టం. కాని, ఒక్క టికెట్టే కొనండి. నేను రావడానికి వీలులేదు. సుబ్బలక్ష్మమ్మగారితో ఇవ్వాళ సినీమాకి వస్తానని చెప్పాను. నేను వెళ్ళకపోతే, పాపం, ఆవిడా మానుకొంటుంది.'

'ఓస్! పోనిద్దూ! ఇప్పుడు ఆవిడతో వెళ్ళకపోతేనేం చూద్దాంలే'

ఎప్పుడో ఒకసారి విశ్వప్రయత్నం మీద తప్ప, సుబ్బలక్ష్మమ్మగారికి ఇల్లు కదలడానికి అవకాశమే దొరకదు. ఇవాళ్ళ, తన మూలాన, ఆవిడ ప్రయత్నమంతా వృధా ఐంది. వస్తానని చెప్పి, రానందుకు ఏమనుకుందో!

—నాటకంలో ఉన్నంతసేపూ ఇదే ఆలోచన.

'మాలతితో తప్పకుండా వస్తామని చెప్పానుగదా, వెళ్ళకపోతే ఎలాగ' అని అతనివాదన.

మరి, తనూ, సుబ్బలక్ష్మమ్మగారితో 'తప్పకుండా వస్తానని' చెప్పిందిగా! అది ఫరవాలేదేమో! సుబ్బలక్ష్మమ్మ చదువుకోలేదుగా---ఆవిడతో మాట తప్పితే మాత్రం ఏం!

అసలు అతనికి తను ఆవిడతో స్నేహంగా ఉండడమే ఇష్టం లేదు. 'ఆవిడతో ఏమిటీ కబుర్లు! ఎంతసేపూ వంట యింటిని గురించేగా మాటలు!'—ఎంత హేళన!

...చదువుకున్న ఆడవాళ్ళంతా దేనినిగురించి మాట్లాడుతూ ఉంటారో! అసలు ఈ చదువుకున్న మగవాళ్ళంతా మాత్రం దేనిని గురించి మాట్లాడుతారు! ఇరవైనాలుగు గంటలూ తమ ఆఫీసు విషయాలు కాకపోతే! తనకు ఆఫీసు లేదాయె! రోజంతా తప్పనిసరిగా, వంటఇంటిలోనే కాల

క్షేపంచేస్తూ, ఇంక దేనిని గురించి మాట్లాడ కలుగుతుంది— ఎంత చదువు చదివితే ఏం!

వీధిముఖం చూడడానికైనా తీరిక లేదే...ఐనవేళ, కానివేళ, ఎవరో స్నేహితులు దిగుతూనే ఉంటారుగా--- కాఫీకి, భోజనానికి. ఎన్నిసార్లు విస్తట్లో పెట్టుకోబోయిన అన్నం ఆవచ్చినవారికి వడ్డించి, తాను మళ్ళీ వంట మొదలుపెట్టలేదు! రాత్రి తొమ్మిదింటికైనా సరే, ఎవరైనా వస్తే కుంపటి రాజేయవలసిందే గదూ కాఫీకని. ఈ స్నేహితులు కులాసాగా కబుర్లు చెప్పుకోటానికి వస్తారో లేక కాఫీకోసరమే వస్తారో! చాదస్తం!! హాయిగా భోంచేసివచ్చినవాళ్ళచేత బలవంతంగా కాఫీ త్రాగించడం దేనికో!

మర్యాదట! మాట్లాడితే, 'నీదంతా పూర్వకాలం పద్ధతి—నీకేం తెలుసు' అంటారు. ఏం అహంభావం!!

ఆలోచిస్తో, ఆలోచిస్తో, జానకికి అతను తనను నిజంగా అన్యాయంచేస్తున్నాడేమో అనిపించింది. తనకూ ఏవో అభిప్రాయాలూ, ఊహలు కోరికలు ఉంటాయనీ, అవి ఫలించకపోతే తనకూ కాస్తో కూస్తో బాధకలుగుతుందనీ, అతనికెందుకు తోచదో!

తన ఆశలు, అభిరుచులు అన్నీ అతని భావాల కనుగుణంగా మారిపోవాలనుకుంటాడు. అతని కిష్టంలేని రంగులు కట్టగూడదు. అతనికి నచ్చని సినిమాలు చూడకూడదు; అతనికి బాగున్న పుస్తకాలే తనకూ బాగుండాలి. తనకు ఎంత ప్రియమైన పుస్తకాలైనా సరే, అతనికి నచ్చకపోతే,

చాటుగా చదువుకోవలసిందే — అతని వెక్కిరింపుకు భయపడి.

తన అభిరుచులు కొన్నైనా వేరుగా ఎందుకు ఉండ కూడదో! ఇది ఎక్కువ సంస్కారమున్నదన్న గర్వమో లేక పురుషులందరికీ స్వభావసిద్ధంగా ఉండే అహంభావమో! తనకోసం అతను మారకూడదూ? అతని అలవాట్లను కొంచ మైనా ఎందుకు మార్చుకోలేరో! రెండేళ్లైనా, ఈ సిగరెట్టు వాసన ఇంకా భరించలేకుండానే ఉంది — 'తల తిరుగు తోంది' అని చెప్పినా ఎందుకు వినరో!

అతనికోసం, అతని ఆనందం కోసం, తను ఎంత ఉత్సాహంతో ప్రయాసపడుతోంది! అతనికోసం, అతని ఆనందం కోసం ఎన్ని ఇబ్బందులు సహిస్తోంది!

ఎన్ని విషయాలలో, తన కిష్టంలేకపోయినా మనసు సరిపుచ్చుకుంటున్నదో, అతనికి ఎప్పటికైనా తెలుస్తుందా? తనకే తెలియదు, అసలు; — ఎప్పుడో ఇల్లాగ నిద్రరాని రాత్రి ఏవేవో ఆలోచనలు రేగినప్పుడు తప్ప.

—ఉన్నట్టుండి, గాలికి కిటికీలు తెరుచుకున్నాయి. లోపల వెన్నెల పడింది. బయట పందిరిమీదనుంచి జాజి పువ్వుల వాసన గుప్పుమంది.

వెన్నెట్లో ఆమెహృదయం కాస్త శాంతపడింది. రాత్రంతా, ఇంత మనోహరంగానే వెన్నెల కాస్తూన్నది కాబోలు! నిద్రమత్తులో ఉన్న ప్రపంచానికి వెన్నెల ఎందుకో!

ఎవరు చూచి సంతోషించను!— 'అడవిగాచిన వెన్నెల' అంటే, ఇదేనేమో!

అబ్బా! నిద్రలేక తలదిమ్మెక్కింది—దూరాన మువ్వల మ్రోత— పాలవాళ్ళు ఆవుల్ని తోలుకువెళుతున్నారు కాబోలు—

తెల్లవారవచ్చింది. అబ్బా! ఒక్క పావుగంటైనా నిద్రపడితే బాగుండును! ఈ కళ్ల మంటలు కొంచెమైనా తగ్గునేమో! లేకపోతే, తెల్లవారి పనే చెయ్యలేదు.

—'జానకీ! కాఫీ తెస్తావా?' నిద్రమత్తులోనే ఆ కోరడము! రోజూ కాఫీ కప్పు చేతికి వస్తేనేగాని అతనికి మెలుకువరాదు. ఒక్కొక్కప్పుడు, ఆమెను లేపి, కాఫీ కాచమని, తాను మళ్ళీ నిద్రపోతుంటాడు!

ఇవ్వాళమాత్రం జానకి వినిపించుకోలేదు. ఆమె కప్పుడే కొంచెం నిద్రపడుతోంది. కాని, అవతలి మంచం మీదనుంచి ఇంకా, 'కాఫీ కాఫీ!' అనే ఆర్తనాదం వినబడుతూనే ఉంది—జానకి లేచేవరకూ ఆగలేదు.

'ఊ! అమ్మా!'—పూర్తిగా మెలకువ తెచ్చుకోలేక, ఆ బాధ.

కప్పు చేతికిచ్చి, జానకి వెళ్లబోయింది.

'చూడు! ఇవ్వాళ ఆదివారం కాదూ? శ్యామలరావునీ, గణపతినీ భోజనానికి రమ్మన్నాను—ఇక్కడే పేకాడుకోవచ్చని. వంట పెందలాడే అవుతుందా!'

జానకిముఖం వాడింది—ఒక్క క్షణం మాత్రమే! మళ్ళా, మామూలు ఉత్సాహంతోనే అన్నది:

'ఓ! కాకేం చేస్తుంది—పేపరు పైకి తేనా? లేక పోతే క్రిందికి దిగి వస్తారా?'

'ఇదుగో వస్తున్నాను'

—ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ మేడదిగారు.

ఆమె నిద్రలేనికళ్ళు చూశాడు అతను. కాని, 'రాత్రి సరిగా నిద్రపట్టలేదా? వంట్లో కులాసాగా ఉన్నదా!' అని అడగాలని అతనికి తోచలేదు

'నాకు రాత్రంతా నిద్రపట్టలేదు. ఒక్కటే తలనొప్పి. వంట్లో ఏం బాగుండలేదు' అని చెప్పాలని ఆమెకూ తోచలేదు.

...నవ్వుతూ, రెండోకప్పు కాఫీ అతనిచేతి కందిం చింది జానకి.

కాఫీ తాగుతూ, అతను పేపరులోతలదాచుకున్నాడు